ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు
జిల్లా వార్తలు

గురువారం 1 ఫిబ్రవరి 2024

● నిజమైన పిస్టలే అని నిరూపించడానికి

కాల్పులు జరిపాడు

మాజీ ఆర్మీ ఉద్యోగిపై కేసు నమోదు చేసిన పోలీసులు



కిందపడిన బుల్లెట్





కాల్పులు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు - మల్లికార్జునను విచారిస్తున్న సీఐ

స్నేహితులంతా కలిసి మందుకొట్టారు. సరదాగా మాట్లాడుకున్నారు. జేబులో ఉన్న పిస్టల్‌ను ఒకరు చేతిలోకి తీసుకున్నారు. దాన్ని చూసి మరొకరు 'బొమ్మ పిస్టల్ తెచ్చుకున్నావా?' అని ఎగతాళిగా అడిగారు. అందరూ గొల్లున నవ్వారు. అంతే పిస్టల్ తీసిన వ్యక్తి అహం దెబ్బతినింది. వెంటనే పిస్టల్‌ను నేలకు గురిపెట్టి టపీటపీ కాల్చి.. నిజమైనదే అని నిరూపించాడు. దీంతో చుట్టూ ఉన్నవాళ్లంతా భయపడి పరుగులు తీశారు. చిత్తూరు సీబీ రోడ్డులో మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. వెంటనే పోలీసులకు సమాచారం అందింది. కాల్పులు జరిపిన మిట్టూరు ఆశ్రమ వీధికి చెందిన కేఆర్ మల్లికార్జునను అదుపులోకి తీసుకున్నారు. ఈయన ఆర్మీలో పనిచేస్తూ 2021లో పదవీ విరమణ పొందాడు. ఆ తర్వాత లైసెన్స్‌డ్ రివాల్వర్‌ను తీసుకున్నాడు. ప్రస్తుతం తిరుపతిలో కాంట్రాక్టు పద్ధతిపై ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఈ కాల్పుల్లో ఎవరూ గాయపడకపోవడం అదృష్టం. సీఐ విశ్వనాథరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. - చిత్తూరు

ఉత్తుత్తి డీఎస్సీ వద్దు

'మెగా డీఎస్సీ అని ఊదరగొట్టారు. ఇప్పుడు కేవలం 6 వేల పోస్టులతో ఉత్తుత్తి డీఎస్సీ నిర్వహించడానికి చర్యలు చేపడుతున్నారు. ఇలా ప్రభుత్వ తీరు నిరుద్యోగులను నిరాశ పరుస్తోంది' అని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్, బోడే మోహన్ విమర్శించారు. చిత్తూరులోని గాంధీ విగ్రహం ముందు బుధవారం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రద్దు చేయించిన అప్రెంటీస్ విధానాన్ని మళ్లీ తెరపైకి తీసుకురావడం దుర్మార్గమన్నారు. పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండు చేశారు. వేతన సవరణ కమిటీ వేసి నెలలు గడుస్తున్నా ప్రయోజనం లేదని, కనీసం మధ్యంతర భృతిపై చర్చించకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. ఈ ఆందోళనలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, అదనపు ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, నాయకులు దేవరాజులురెడ్డి, చంద్రన్, రాధాకుమారి, కిషోర్, సురేష్, హరీష్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

- చిత్తూరు (సెంట్రల్)



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఎస్టీయూ నాయకులు

ఆ రూ.36 కోట్లు ఎవరిస్తారు



● కొవిడ్ బిల్లుల కోసం ఏళ్లుగా తహసీల్దార్ల ఎదురుచూపులు

● ఇప్పుడు బదిలీలతో ఆందోళనలో అధికారులు

మూడేళ్ల కిందట కొవిడ్ కారణంగా మండలాల్లో క్వారెంటైన్ కేంద్రాలు తదితరాల ఏర్పాటు కోసం ఖర్చు చేసిన రూ.36 కోట్ల బిల్లులు ఇంకా పెండింగులోనే ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో ఉన్నతాధికారుల హామీతో అప్పట్లో తహసీల్దార్లు తమ సొంత డబ్బుల్ని ఖర్చు చేశారు. మూడేళ్లు పూర్తవుతున్నా ఆ నిధులు రాకపోవడంతో ఇన్నాళ్లు వడ్డీలు కట్టుకున్న తహసీల్దార్లు, ఇప్పుడు జిల్లా నుంచి బదిలీ అయిపోతుండడంతో బిల్లుల విషయంగా మరింత ఆందోళన పడిపోతున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి/చిత్తూరు కలెక్టరేట్

ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 51 మంది తహసీల్దార్లను బదిలీ చేశారు. వారంతా ఒకట్రెండు రోజుల్లో కేటాయించిన కొత్త స్థానాల్లో చేరిపోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వారికి బిల్లుల భయం పట్టుకుంది. ఒక్కొక్కరికి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. క్వారంటైన్ నిర్వహించిన కేంద్రాల్లో ఈ బిల్లులు మరింత అధికంగా పెండింగులో ఉన్నాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలోని తహసీల్దార్లకు ఏకంగా రూ.36 కోట్ల కొవిడ్ బిల్లులు పెండింగులో ఉన్నాయి.

లేఅవుట్ల చదును, ఓటరు దరఖాస్తులకూ..

మండలాల్లో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించేటప్పుడు అధికారుల మీద బరువు లేకుండా గత టీడీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసేది. వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో అలా ప్రత్యేకంగా నిధుల్ని విడుదల చేసింది లేదు. జగనన్న లేఅవుట్ల కోసం ప్రభుత్వ స్థలాలను వెతికి వాటిని చదును చేసి పేదలకు పట్టాలను అందించేవరకు పూర్తి బాధ్యత తహసీల్దార్లదే. అలా చదును చేసేందుకు కొందరు తహసీల్దార్లు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేసుకున్నారు. మరికొందరు స్థానిక వైసీపీ నేతలతో చేయించారు. అలాగే ఇటీవల ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో వేల సంఖ్యలో ఫాం6, ఫాం7 దరఖాస్తులు వచ్చాయి. ఫాం6, ఫాం7 దరఖాస్తుల్ని ఏర్పాటు కోసం ఒక్కో తహసీల్దార్‌కే రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అయింది. తహసీల్దార్లకు నెలకు రూ.35 వేల చొప్పున అందించే వెహికల్ అలవెన్సులు కూడా రూ.20 లక్షల వరకు పెండింగులో ఉంది. వాహన రిపేర్ల బిల్లులు అదనం. భూరక్ష పథకానికి సర్వే రాళ్లకు సైతం తహసీల్దార్లు డబ్బులు ఖర్చు చేశారు. ఒక్కో సర్వే రాయికి రూ.70 చొప్పున ఖర్చు చేయగా, 50 శాతం నిధులు మాత్రమే ఇటీవల విడుదలయ్యాయి. ఇంకా స్టేషనరీ, కార్యాలయానికి వినియోగించే విద్యుత్ బిల్లులు రాలేదు. వీటికి సైతం తమ సొంత నిధులను వెచ్చించారు. అధికారికంగా, అనధికారికంగా మండల పరిధిలో చేస్తున్న పనులకు ఒక్కో తహసీల్దార్‌కు కనీసం రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల మధ్య రావాల్సి వుంది. బిల్లులు రాకుండానే ఎన్నికల బదిలీలు అవుతున్నామనే ఆవేదనలో తహసీల్దార్లు వున్నారు. ఎన్నికల అనంతరం జూన్ నెల తర్వాత తిరిగి జిల్లాకు వస్తే కలెక్టర్ ఎక్కడ పోస్టింగ్ వేస్తారో తెలియదు. ఇలాంటి పరిస్థితుల్లో తహసీల్దార్లలో బకాయిలపై ఆందోళన నెలకొంది. ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులు రాక, ఖర్చు చేసిన వాటిని ఎలా రాబట్టుకోవాలో తెలియక తహసీల్దార్లు అంతర్మథనంలో పడ్డారు.

చిత్తూరు డీఆర్వోగా పుల్లయ్య

● డోన్ ఆర్డీవో వెంకటరెడ్డి నగరికి..

● పలువురు డిప్యూటీ కలెక్టర్ల బదిలీ



పుల్లయ్య

చిత్తూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా పుల్లయ్య రానున్నారు. ప్రస్తుతం నంద్యాల జిల్లా డీఆర్వోగా ఉన్న ఆయన, చిత్తూరు డీఆర్వో రాజశేఖర్ స్థానంలోకి వస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో పెద్దఎత్తున డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో జిల్లాలోనూ పలువురు డిప్యూటీ కలెక్టర్లు బదిలీ అయ్యారు.

చిత్తూరు డీఆర్వో కోసం మూడు ఉత్తర్వులు

గతేడాది అక్టోబరులో జరిగిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో రామాయపట్నం పోర్టు భూసేకరణ విభాగ స్పెషల్ కలెక్టర్ పద్మావతిని చిత్తూరు డీఆర్వోగా బదిలీ చేశారు. ఇక్కడి డీఆర్వో రాజశేఖర్‌ను అనంతపురం డీఆర్వోగా మార్చారు. ఆమె రాకపోవడంతో రాజశేఖర్ చిత్తూరులోనే ఉండిపోవాల్సి వచ్చింది. అప్పట్లోనే మరోసారి జరిగిన బదిలీల్లో నంద్యాల ఆర్డీవో శ్రీనివాసులును చిత్తూరు డీఆర్వోగా బదిలీ చేసి, ఇక్కడ డీఆర్వో రాజశేఖర్‌ను ఇక్కడే డ్వామా పీడీగా మార్చారు. కారణాలు ఏవోగానీ నంద్యాల ఆర్డీవో కూడా జాయిన్ కాలేదు. జిల్లాలో ఎన్నిల విభాగంలో రాజశేఖర్ మూడేళ్లుగా పనిచేయడంతో ఈసారి కచ్చితంగా మార్చాల్సి రావడంతో గతేడాది అక్టోబరులోనే చిత్తూరు డ్వామా పీడీగా బదిలీ చేశారు. కొత్త డీఆర్వో రాకపోవడంతో ఆయన అదే స్థానంలో కొనసాగుతున్నారు. తాజాగా జరిగిన బదిలీల్లో నంద్యాల డీఆర్వో పుల్లయ్య చిత్తూరుకు బదిలీ కావడంతో, ఇక రాజశేఖర్ డ్వామా పీడీగా జిల్లాలోనే కొనసాగనున్నారు. కర్నూలు జిల్లాకు చెందిన పుల్లయ్య 1995 డిప్యూటీ తహసీల్దార్ బ్యాచ్‌కు చెందిన అధికారి.



వెంకటరెడ్డి


● ప్రస్తుతం నగరి ఆర్డీవో సుజాతను తిరుపతిలోని తుడా భూసేకరణ విభాగానికి బదిలీ చేశారు. ఆమె స్థానంలోకి కర్నూలు జిల్లా డోన్ ఆర్డీవో వెంకటరెడ్డి వచ్చారు. నగరి నియోజకవర్గానికి చెందిన ఫాం6, ఫాం7 జాబితాను ఎన్నిసార్లు అడిగినా ఇవ్వడం లేదంటూ సుజాత మీద టీడీపీ నాయకులు గతంలో కలెక్టర్ షన్మోహన్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అలాగే చిత్తూరు ఐవోసీల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవానీ చిత్తూరులోనే ఖాళీగా ఉన్న ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నంద్యాల రైల్వే భూసేకరణ విభాగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ వచ్చారు. కడప జిల్లాలో తహసీల్దార్‌గా ఉంటూ తాజాగా డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన మధుసూదన్‌రెడ్డి జిల్లాలోని కేఆర్ఆర్‌సీ (కోనేరు రంగారావు కమిటీ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా వచ్చారు.

ఏమి కరెక్టు చేసినట్లు?


● ఓటర్ల తుది జాబితాలోనూ తప్పులే



జాబితాలో ఉన్న మృతుల పేర్లు



జాబితాలో ఓటరు ఫొటో కనిపించని వైనం



వలస వెళ్లిపోయినా ఓటరే

సదుం, జనవరి 31: ముసాయిదా ఓటర్ల జాబితాలోని తప్పులను అధికారులు ఏమాత్రం సరిచేశారో తెలియదు. తుది జాబితాలోనూ అవే తప్పులు కనిపిస్తున్నాయి. ఒకే ఇంట్లో కాపురం ఉంటున్న భార్యాభర్తలకు సంబంధించి.. వేర్వేరు వీధుల్లో నివాసం ఉంటున్నట్లు జాబితాలో చిరునామాలు ఉండడం సిబ్బంది నిర్లక్ష్య వైఖరికి నిదర్శనంగా నిలుస్తోంది. సదుంలోని 82వ పోలింగ్ కేంద్రానికి సంబంధించి ఓటర్ల జాబితాలో కొన్నింటిని పరిశీలిస్తే.. సీరియల్ నెం.239లో వీరబొమ్మల శారదమ్మ, 301లో రాజంపేట మహేశ్ కుమార్, 716లో వీరమల్లయ్యగారి కృష్ణమూర్తి, 96లో లద్దిగం చంద్రయ్య, 99లో లద్దిగం లక్ష్మమ్మ మృతి చెందారు. అయినప్పటికీ వీరిని ఓటర్లుగానే ఉంచారు. ఎన్నో ఏళ్ల క్రితమే ఉద్యోగ, వ్యాపార, జీవనోపాధి నిమిత్తం బయట ప్రాంతాలకు వలస వెళ్లిపోయిన వారూ ఓటర్లు జాబితాలో ఉన్నారు. నివాసాల అసలు చిరునామాలు కాక ఎక్కడో వేర్వేరు వీధుల్లో ఉంటున్నట్లు ఉన్న చిరునామాలు విమర్శలకు తావిస్తోంది. సీరియల్ నెంబరు, పేరు, చిరునామా ఉండి ఫొటో లేని తప్పులు ఎక్కువే.



చిరునామా మారిపోయింది మరి

ఇద్దరు సీఐల బదిలీ


చిత్తూరు, జనవరి 31: జిల్లాలో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీఆర్‌లో ఉన్న టి.చిన్నగోవిందును గంగవరం అర్బన్ పోలీసు స్టేషన్‌కు, దిశ పోలీసు స్టేషన్‌లో బి.లక్ష్మణ్ణను అనంతపురం జిల్లా సింగనమలకు బదిలీ చేశారు.

5న రామకుప్పానికి సీఎం జగన్



కుప్పం, జనవరి 31: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈనెల 5వ తేదీన రామకుప్పం మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు సీఎం పర్యటన ఖరారైనట్లు వైసీపీ నాయకులు స్పష్టం చేశారు. హంద్రీ-నీవా కాలువను ప్రారంభించడంతో పాటు ఆసరా సమావేశం, బహిరంగ సభల్లో ఆయన పాల్గొననున్నారు.

6న చంద్రబాబు రాక



వెదురుకుప్పం, జనవరి 31: టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 6వ తేదీన గంగాధరనెల్లూరుకు రానున్నారు. మండల కేంద్రంలో జరగనున్న 'రా కదలి రా' బహిరంగ సభలో పాల్గొంటారు. ఆ కార్యక్రమానికి టీడీపీ శ్రేణులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి థామస్ కోరారు.

కళ తప్పిన 'ఆడుదాం ఆంధ్ర'

● జిల్లా స్థాయి పోటీల ప్రారంభానికి హాజరుకాని మంత్రులు, ఎమ్మెల్యేలు

● కనీస వసతుల్లేక క్రీడాకారుల అవస్థలు ● కొట్టుకున్న ఆటగాళ్లు

చిత్తూరు క్రీడలు, జనవరి 31: 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను తొలిరోజు మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి అట్టహాసంగా ప్రారంభించారు. అదే, బుధవారం చిత్తూరు మెసానికల్ మైదానంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల ప్రారంభోత్సవంలో ఆ కళ కనిపించలేదు. మేయర్ అముద, జేసీ శ్రీనివాసులు కలిసి పోటీలను ప్రారంభించగా, జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, కమిషనర్ అరుణ, ఆర్డీవో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు. సదుపాయాలను కల్పించడంలో క్రీడాప్రాధికార సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో మహిళా క్రీడాకారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. తాగునీటి వసతితీ కల్పించలేదు. మైదానంలో.. ఎండలోనే భోజనాలు చేయాల్సి వచ్చింది. చివరకు మరో అధికారి చొరవతో అప్పటికప్పుడు అంబేడ్కర్ భవన్‌లో భోజనాలు ఏర్పాటు చేశారు. క్యాటరింగ్ వారు ఏర్పాటు చేసిన తాగునీళ్లు సరిపోలేదని క్రీడాకారులు అన్నారు. తొలిరోజు ప్రారంభోత్సవం రోజు ఉన్న శ్రద్ధ ఇప్పుడు లేదని పలువురు విమర్శించారు.

కొట్టుకున్న క్రీడాకారులు

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు పుంగనూరు మండలానికి చెందిన మహిళా జట్టు చిత్తూరుకు వచ్చింది. పుంగనూరు జట్టు పలమనేరు జట్టుతో తలపడింది. పోటీలో గొడవ చెలరేగడంతో పుంగనూరుకు చెందిన క్రీడాకారిణి.. పలమనేరుకు చెందిన ఓ క్రీడాకారిణిని కొట్టింది. దీంతో దాడికి పాల్పడిన పుంగనూరు జట్టులోని క్రీడాకారిణిని అధికారులు డిస్‌క్వాలిఫై చేశారు. దీంతో జట్టుకు సరిపడా క్రీడాకారులు లేకపోవడంతో అధికారులు పుంగనూరు జట్టును డిస్‌క్వాలిఫై చేశారు.

● నగరికి చెందిన జట్టులో మండల స్థాయిలో పోటీలో పాల్గొనని క్రీడాకారులు ఉన్నారని పూతలపట్టు క్రీడాకారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో నగరి జట్టునూ డిస్‌క్వాలిఫై చేసినట్లు అధికారులు చెప్పారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జేసీ శ్రీనివాసులు

కొందరికే కందిపప్పు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 31: నాలుగు లక్షల మంది కార్డుదారులకు ఈనెల కందిపప్పు పంపిణీకి కోతపడింది. జిల్లావ్యాప్తంగా 5.41లక్షల రేషన్ కార్డులు ఉండగా, వారికి కేజీ వంతున కందిపప్పు పంపిణీకి 541 టన్నుల కందిపప్పు అవసరం. కాగా ప్రభుత్వం జిల్లాకు 150 టన్నులు మాత్రమే కేటాయించగా, పౌరసరఫరాల సంస్థ యంత్రాంగం ఎం.ఎల్.పాయింట్ల ద్వారా డీలర్లకు పంపిణీ పూర్తిచేసింది. దీంతో 400 టన్నులు కందిపప్పు కోటాకు కోత పడడంతో కార్డుదారులకు ఈసారి అందే అవకాశం లేదు. దీనిపై కార్డుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా గురువారం నుంచి ఫిబ్రవరి నెల కోటా పంపిణీ ప్రారంభం కానుంది. ఇందుకోసం 150 టన్నుల గోధుమ పిండి, 250 టన్నుల రాగులు, అర కేజీ వంతున పంపిణీ కోసం 270 టన్నుల చక్కెర జిల్లాకు రాగా, వాటిని పౌరసరఫరాల సంస్థ డీలర్లకు అందజేసింది.

జేఈఈ మెయిన్స్‌కు 253 మంది

చిత్తూరు (సెంట్రల్), జనవరి 31: చిత్తూరులోని సీటమ్స్‌లో బుధవారం జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షలకు 256 మంది విద్యార్థులకు గాను 253 మంది హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు. ఉదయం పరీక్షకు 128 మందికి గాను 127 మంది.. మధ్యాహ్నం 128 మందికి గాను 126 మంది హాజరయ్యారన్నారు.

ఉమ్మడి జిల్లాలో భారీగా తహసీల్దార్ల బదిలీ

- రాత్రికే రిలీవింగ్ ఆర్డర్లు విడుదల
- నేడే కొత్తస్థానాల్లో చేరాలి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 31: ఉమ్మడి జిల్లా తహసీల్దార్లను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ జాబితాలను రాష్ట్ర భూపరిపాలన శాఖ(సీసీఎల్ఏ)జోన్-4గా జాబితాసిద్ధం చేసింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన బదిలీలు కావడంతో సీసీఎల్ఏనే తహసీల్దార్లను జిల్లాలకు కేటాయించింది. దీనిప్రకారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ ఉత్తర్వులు ఇస్తారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న 67 మంది తహసీల్దార్లలో 16 మంది తప్ప మిగిలిన 51 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆ 16 మందిలో 11 మంది జూన్ 30 నాటికి పదవీ విరమణకు దగ్గరలో ఉండగా.. జూన్ 30 నాటికి మూడేళ్ల తక్కువ సర్వీసు కలిగిన ఐదుగురు ఉన్నారు. దీంతో వీరికి మినహాయింపు ఇచ్చారు. అలాగే, ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 22 మంది, కర్నూలు జిల్లా నుంచి 21 మంది, వైఎస్సార్ కడప జిల్లా నుంచి 20 మంది చొప్పున 63 మంది తహసీల్దార్లను ఉమ్మడి జిల్లాకు బదిలీ చేస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన వారికి బుధవారం రాత్రే రిలీవింగ్ ఉత్తర్వులు సిద్ధం కాగా.. గురువారం తమకు కేటాయించిన జిల్లాల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

జిల్లా నుంచి కర్నూలుకు..

కలెక్టరేట్ ఏవో కులశేఖర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఆర్.వాసుదేవన్, ఎన్నికల సూపరింటెండెంట్ కె.బ్యూలా, ఎస్.మాధవరాజు (చౌడేపల్లె), వి.చంద్రశేఖర్ (సదుం), బి.పార్వతి (కుప్పం), ఎస్.ఎం.గుర్రప్ప (గుడుపల్లె), ఐ.మురళీమోహన్ (చిత్తూరు), కె.బాబు రాజేంద్రప్రసాద్ (గుడిపాల), కె.బెన్నురాజ్ (బంగారుపాళ్యం), జి.జయప్రకాష్ (శ్రీరంగరాజపురం), కె.బాబు (పాలసముద్రం), జి.చంద్రశేఖర్ రెడ్డి (నగరి), పి.ఝాన్సీలక్ష్మి (శ్రీకాళహస్తి), ఎం.భార్గవి (బుచ్చినాయుడు కండ్రిగ), ఎం.ఉదయసంతోష్ (రేణిగుంట),సి.ఆర్.శేషయ్య(మదనపల్లె ఆర్డీవో కార్యాలయం), కె.నిర్మలాదేవి (అన్నమయ్య కలెక్టరేట్).

వైఎస్సార్ కడప జిల్లాకు..

నగరి ఆర్డీవో కార్యాలయ ఏవో పి.శివరామన్, కుప్పం ఆర్డీవో ఆఫీసు ఏవో ఎస్.ఎస్.కృష్ణకుమార్, అమర్‌నాథ్ (రొంపిచెర్ల), ఇ.అమర్‌నాథ్ (గంగవరం), ఆర్.ఇన్బనాథన్ (గంగాధరనెల్లూరు), ఎం.భగవతి (నింద్ర), ఐ.శేషగిరిరావు (పులిచెర్ల), కె.కుప్పయ్య (కలెక్టరేట్), పి.భారతి (తిరుపతి కలెక్టరేట్), వివిఎన్‌వీ ఆర్ కృష్ణ (డక్కిలి), ఎం.రోసయ్య (నాయుడుపేట), షేక్ జరీనా (సత్యవేడు), ఎస్.శివప్రసాద్ (ఏర్పేడు), యు.మధుసూదన్‌రావు (పిచ్చాటూరు), ఎస్.పరిమళ (నారాయణవనం), కె.వెంకటరమణ (తిరుపతి అర్బన్), ఎస్.శిరీష (చంద్రగిరి), కె.పి.భాగ్యలక్ష్మి (పాకాల), ఐ.సుబ్రహ్మణ్యం (వడమాలపేట), వై.రమేష్‌బాబు (తిరుపతి), ఆర్.వెంకటలక్ష్మమ్మ (తిరుపతి), ఎస్. మహేశ్వరిబాయి (సంబేపల్లి), కె.ధనుంజయులు (పీలేరు), ఎం.భీమేశ్వరరావు (కురబలకోట), సి.శ్రీనివాసులు (ములకలచెరువు), జె.రాము (పెద్దమండ్యం) బదిలీ అయ్యారు.

అనంతపురం జిల్లాకు..

టి.సీతారామ్ (పుంగనూరు), జి.కె.కుమారస్వామి (బైరెడ్డిపల్లి), వై.చిట్టిబాబు (వి.కోట), బి.హనుమంతు (యాదమరి), డి.రవికుమార్ (కార్వేటినగరం), డి.లక్ష్మీనారాయణ (వెదురుకుప్పం), ఎం.హనుమాన్ నాయక్ (బాలయ్యపల్లె), జె.నిత్యానంద బాబు (తొట్టంబేడు), సి.శ్రీదేవి (కేవీబీపురం), టి.వి.సుబ్రహ్మణ్యం (తిరుపతి రూరల్), జె.పరమేశ్వరస్వామి (పుత్తూరు), యు.దస్తగిరయ్య (ఎర్రావారిపాళ్యం), ఎం.లోకేశ్వరి (చిన్నగొట్టిగల్లు), సి.కె.శ్రీనివాసులు (తంబళ్లపల్లి), జె.భాగ్యలత (కలిగిరి) ఉన్నారు.

ఆదిమూలం దెబ్బ

- గురుమూర్తి రీబ్యాక్
- రాజేష్‌కు సత్యవేడు ఛాన్సు



గురుమూర్తి

తిరుపతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అధిష్ఠానం నిర్ణయాన్ని ధిక్కరించి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కొట్టిన దెబ్బకు అధికార పార్టీ ఇంచార్జుల జాబితా తారుమారైంది. బుధవారం ఆ పార్టీ విడుదల చేసిన ఐదవ జాబితాలో దాని ప్రభావం కొట్టొచ్చినట్టు కనిపించింది. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ ఇంచార్జిగా స్థానిక ఎంపీ గురుమూర్తిని ప్రకటించిన అధిష్ఠానం సత్యవేదుకు నూకతోటి రాజేష్‌ను ఇంఛార్జిగా నియమించింది. రాజేష్ మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ సోదరి కుమారుడు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలాన్ని ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా తిరుపతి లోక్‌సభ స్థానానికి ఇంఛార్జిగా నియమిస్తూ గత 7వ తేదీన నాలుగో జాబితాలో అధిష్ఠానం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ జాబితాలోనే సత్యవేడు ఇంఛార్జిగా తిరుపతి ఎంపీ గురుమూర్తిని ప్రకటించింది. ఆ జాబితా కారణంగా జిల్లా వైసీపీలో ముసలం పుట్టినట్టయింది.తిరుపతి ఎంపీగా పోటీ చేయడానికి ఇష్టపడని ఆదిమూలం ఆ విషయం అధినేతకు, మంత్రి పెద్దిరెడ్డికి పదేపదే చెప్పుకున్నా ఫలితం లేకపోయింది. నియోజకవర్గ వైసీపీలో వ్యతిరేక వర్గం ముందు తలెత్తుకోలేని పరిస్థితులు ఏర్పడడంతో ఎంపీ టికెట్ కంటే ఆత్మాభిమానమే ముఖ్యమని భావించిన ఆదిమూలం ఎంపీ టికెట్ తనకు వద్దని, అంతకు మించి దళితులకు గౌరవం ఇవ్వని పార్టీయే తనకు అవసరం లేదని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో ఆయన టీడీపీలో చేరేందుకు ఆ పార్టీ యువనేత నారా లోకేశ్‌ను కలిశారు. ఈ పరిణామాలతో వైసీపీ అధిష్ఠానం షాక్‌కు గురైంది. తాజా జాబితాలో తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్యవేడు అసెంబ్లీ ఇంఛార్జిగా తప్పించి తిరిగి తిరుపతి లోక్‌సభకు ఇంఛార్జిగా ప్రకటించారు. ఖాళీగా వున్న సత్యవేడుకు నూకతోటి రాజేష్‌ను నియమించారు. రాజేష్ మంత్రి పెద్దిరెడ్డికి అత్యంత సన్నిహితుడు. జీడీనెల్లూరులో అవకాశం కల్పించాలని ఎంత ప్రయత్నించినా సమీకరణల కారణంగా వీలు కాలేదు. జీడీనెల్లూరు నుంచీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని తప్పించి అక్కడ రాజేష్‌ను ఇంఛార్జిగా నియమించాలన్న ప్రయత్నాలు బలంగా జరిగాయి. అయితే నారాయణస్వామి అధినేత ఎదుట తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడంతో మనసు మార్చుకున్న అధినేత చిత్తూరులో ఎంపీ స్థానానికి ఇంఛార్జిగా వేశారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్పను అనివార్యంగా జీడీనెల్లూరు అసెంబ్లీకి బదిలీ చేయాల్సి వచ్చింది. దీంతో రాజేష్‌కు అవకాశం కల్పించలేకపోయారు. అయితే ఆదిమూలం పార్టీని వీడడంతో అనూహ్యంగా రాజేష్‌కు అవకాశం దక్కింది. గెలుపోటముల సంగతి పక్కనపెడితే ఈ దఫా టికెట్ దక్కదని తీర్మానించుకున్న రాజేష్‌కు అదృష్టం తలుపు తట్టింది. మరోవైపు తిరుపతి నుంచీ సత్యవేడుకు, మళ్ళీ సత్యవేడు నుంచీ తిరుపతికి బంతిలా అటూఇటూ దొర్లిన గురుమూర్తి సైతం తీవ్ర ఆవేదనతో వున్నట్టు సమాచారం. మొత్తానికి కోనేటి ఆదిమూలం తీసుకున్న నిర్ణయం వైసీపీలో అనేక మార్పుచేర్పులకు కారణమవుతోంది.



రాజేష్

చెవిరెడ్డికి వైసీపీలో మరిన్ని బాధ్యతలు



చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి తాజాగా వైసీపీలో మరిన్ని అదనపు బాధ్యతలు మీద పడ్డాయి. ఇప్పటికే పార్టీ అనుబంధ విభాగాల ఇంఛార్జిగా వ్యవహరిస్తున్న ఆయన కొంతకాలంగా పూర్తి సమయం పార్టీ అధినేత జగన్‌కు అందుబాటులో వుంటూ పార్టీ సర్వేల నిర్వహణలో కీలక పాత్ర వహిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయనను ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గంతో పాటు కందుకూరు, సంతనూతలపాడు, కావలి అసెంబ్లీ నియోజకవర్గాలకు రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ పార్టీ ఆదేశాలు జారీ చేసింది. ఈ నియామకంతో ఒంగోలు ఎంపీ టికెట్ ఆయనకే కేటాయించే అవకాశముందని జరుగుతున్న ప్రచారానికి బలం చేకూరింది. అనూహ్య పరిణామాలు ఎదురైతే తప్ప ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా ఆయనే బరిలోకి దిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

విశ్వేశ్వర ఆలయ భూమి విక్రయించేందుకు విఫలయత్నం



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ భూమి

పలమనేరు, జనవరి31 : పలమనేరు రాధా బంగ్లా ఏరియాలో ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామికి చెందిన కోట్ల విలువచేసే భూమిని అక్రమంగా విక్రయించేందుకు కొందరు విఫలయత్నం చేశారు. స్థానికులు ఈ విషయాన్ని ఎండోమెంట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా... పట్టణంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి దశాబ్దాలక్రితం మునినారాయణ శెట్టి అనే వ్యక్తి 372-3 సర్వేనంబరులో ఉన్న 81 సెంట్ల భూమిని రిజిష్టర్ చేసి అప్పగించారు. ఆలయ కుమారుడు మృతి చెందడంతో వితంతువైన కోడలు వెంకటమ్మ పేరున రాస్తూ ఆమె ఆ భూమిని అనుభవించుకోవాలని, ఇతరులకు అన్యాక్రాంతం చేయకూడదని, వెంకటమ్మ మరణానంతరం కూడా ఆ భూమికాశీవిశ్వేశ్వరస్వామికి చెందాలన్న షరతులు పెట్టారు. అయితే వెంకటమ్మ ఆ భూమిని ఒకరికి విక్రయించడంతో ఆమె మరణానంతరం ఆ భూమిని స్వాధీనం చేసుకొనేందుకు ఆమె నుంచి కొనుగోలు చేసిన వ్యక్తి రావడంతో ఎండోమెంట్ అధికారులు అడ్డుకొన్నారు. దీంతో అతను కోర్టును ఆశ్రయించారు. జిల్లాకోర్టులో కొన్నేళ్లక్రితం అతడికి అనుకూలంగా తీర్పువచ్చింది. అయితే ఎండోమెంట్ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ భూమి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి చెందుతుందని హైకోర్టు ఇటీవల తీర్పుఇచ్చింది. ఈ విషయం తెలుసుకొన్న కొందరు ఈ భూమిని వెంటనే విక్రయించి సొమ్ముచేసుకోవాలని నిర్ణయించారు. దీంతో మంగళవారం ఆభూమిలో ఉన్న ముళ్లచెట్లను నరికించి ప్రొక్లయినర్ ద్వారా చదును చేసేందుకు ప్రయత్నించారు. ఈవిషయాన్ని స్థానికులు ఎండోమెంట్ అధికారలకు ఫిర్యాదు చేయడంతో వెంటనే వచ్చి ఈ భూమి ఆలయానికే చెందుతుందని హైకోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పడంతో వారు గత్యంతరం లేక వెనుతిరిగారు.

సెబ్ ఏఎస్పీ శ్రీలక్ష్మి బదిలీ

చిత్తూరు, జనవరి 31: సెబ్ ఏఎస్పీ శ్రీలక్ష్మి బదిలీ అయ్యారు. ఈమెను కాకినాడ సెబ్ ఏఎస్పీగా బదిలీచేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు సెబ్ ఏఎస్పీగా ఎవరినీ నియమించలేదు.

తిరుమల ఘాట్‌లో ఎలుగుబంటి హల్‌చల్



రోడ్డుకు సమీపంలో ఎలుగుబంటి

తిరుమల, జనవరి31(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో బుధవారం ఓ ఎలుగుబంటి హల్‌చల్ చేసి భక్తులను భయపెట్టింది. అలిపిరి సమీపంలోని మొద టి మలుపు వద్ద రోడ్డు సమీపానికి ఎలుగుబంటి రావడం యాత్రికులను భయభ్రాంతులకు గురిచేసింది. కొంతసమయం రోడ్డుకు దగ్గరదగ్గరగా ఎలుగుబంటి సంచరించింది. దాదాపు 20 నిమిషాల తర్వాత వాహనాల శబ్దాలను గమనించి ఎలుగుబంటి అక్కడి నుంచి అడవిలోకి వెళ్లిపోయింది.

క్రీడా మైదానాన్ని కాపాడండి

ఎన్నో ఏళ్ల జ్ఞాపకాలను చెరపకండి - క్రీడాభిమానుల వేడుకోలు

తిరుపతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఎస్వీ హైస్కూల్‌కు చెందిన క్రీడా ప్రాంగణంలో నిర్మాణాలు నిలుపుదల చేయాలని పలువురు క్రీడాభిమానులు విజ్ఞప్తి చేశారు. ప్రకాశం రోడ్డులోని ఆటస్థలంలో టీటీడీ బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టడాన్ని నిరసిస్తూ బుధవారం మైదానానికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వచ్చి, వారిని లోపలకు వెళ్లనీయకుండా గేట్లు వేసేశారు. దీంతో గేటు బయటే నిరసనకు దిగారు. 'ప్లే గ్రౌండ్‌లో భవనాలు వద్దు-ఆటలు ముద్దు' అంటూ నినాదాలు చేశారు. తుడా మాజీ ఛైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఎస్వీ హైస్కూల్ గ్రౌండ్ నగరానికి ఒక ఐకాన్‌గా ఉండేదని, అలాంటి దాన్ని నాశనం చేయవద్దని కోరారు. టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ డైనమస్ క్లబ్ ద్వారా ఎంతోమంది ఆటగాళ్లు ఇదే స్థలం నుంచి వచ్చారని నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేశారు. జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు వేదికగా నిలిచిన క్రీడా ప్రాంగణాన్ని కాంక్రీట్ జంగిల్‌గా మార్చకుండా చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. బీఆర్ఎస్ నాయకుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గుంతలు తవ్వేసిన ఆటస్థలం చూసి ఆవేదన కలుగుతోందన్నారు. పార్టీలకతీతంగా ఉద్యమిస్తామన్నారు. జెన్ కిరణ్ మాట్లాడుతూ ఎస్వీ హైస్కూల్ గ్రౌండ్ కనుమరుగైపోతోందని ఆవేదన చెందుతున్నామన్నారు. నాటి ఫుట్‌బాల్ క్రీడాకారుడు మునెయ్య, రెడ్డెప్ప, పిలిప్స్ మాట్లాడుతూ ఇక్కడ జరిగే ఆటల పోటీలను చూసేందుకు టికెట్లు కొనుగోలు చేసి వచ్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం క్రీడా మైదానం చూసినప్పుడల్లా మనసులో తెలియని బాధ కలుగుతోందన్నారు.

అడవి పందుల కోసం కరెంటు ఉచ్చు

- విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు





గంగాధరం (ఫైల్ ఫొటో) - మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

సోమల, జనవరి 31: అడవి పందుల కోసం మామిడి తోటలో విద్యుత్ తీగలు లాగారు. ఈ కరెంటు తీగలకు తగిలి గంగాధరం మృతిచెందాడు. ఇతడికి మూడు నెలల కిందటే వివాహమైంది. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమల మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా... ఆవులపల్లె పంచాయతీ దేవళకుప్పం వద్ద యానాదివాడకు చెందిన పలువురు మంగళ వారం తమ గొర్రెలతో అడవికి వెళ్లారు. సాయంత్రం మందలోని కొన్ని గొర్రెలు కనిపించలేదు. దీంతో తప్పిపోయిన గొర్రెల కోసం వెతకడానికి గంగాధరం (గణపతి), సిద్దప్ప, ఈశ్వరయ్య కలసి అడవి మార్గంలో వెళ్లారు. ఈ మార్గంలోని మామిడి తోట నుంచి అడవి పందుల కోసం విద్యుత్ తీగలు లాగారు. ఇది గమనించని యానాదులు చీకటిలో ఆ విద్యుత్తు తీగలకు తగలడంతో షాక్‌కు గురయ్యారు. వీరిలో గంగాధరం సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఇతడిని కాపాడే ప్రయత్నంలో సిద్దప్పకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిని గుర్తించిన ఈశ్వరయ్య ప్రమాదం నుంచి తప్పించుకుని ప్రాణాలతో బయటపడ్డారు. యానాదివాడకు చేరుకుని గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. తీవ్రంగా గాయపడిన సిద్దప్పకు పెద్దఉప్పరపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్సలు కల్పించి మెరుగైన వైద్యం కోసం సదుం వైద్యశాలకు తరలించారు.గంగాధరానికి మూడునెలలక్రితం వివాహం జరిగింది. పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ వెంకట నరసింహులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. గంగాధరం మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా, రెండు కిలోమీటర్ల దూరం విద్యుత్ తీగలు తీసి ఉండటాన్ని అధికారులు గుర్తించారు.

ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలి

మృతుడి కుటుంబానికి తోట యజమాని శేషాద్రి నాయుడు తదితరులు ఆర్థిక సాయం అందజేయాలని సదుం వైద్యశాల వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండు చేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించి.. ఇలాంటి ఘటనలు జరుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు కోరారు. జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి మంద రామనాథం, జిల్లా యువసేన మాజీ అధ్యక్షుడు మురళి, మండల శాఖ అధ్యక్షుడు ప్రకాశ్ పాల్గొన్నారు.

..ఇక, సెలవు నాన్న

- మిమ్మల్ని మధ్యలో వదిలి వెళుతున్నా క్షమించండి
- ఉద్యోగం కోసం డబ్బుకట్టి మోసపోయానంటూ యువకుడి ఆత్మహత్య



వసంత్ కుమార్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

సదుం, జనవరి 31: 'అమ్మా నాన్నా నన్ను క్షమించండి. ఇలా మధ్యలో వదిలి వెళుతున్నందుకు నాకు బాధగా ఉంది. నాన్న, నేను లేనని నువ్వు బాధ పడకు. అక్కావాళ్లు నిన్ను బాగా చూసుకుంటారు. నీ ఆరోగ్యం జాగ్రత్త. అమ్మను జాగ్రత్తగా చూసుకో' అంటూ సూసైడ్ నోట్ రాసి .. వసంతకుమార్‌రెడ్డి (28) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం సదుం మండలం పాలమంద పంచాయతీ చెరవుముందరపల్లెలో వెలుగు చూసింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం ఒంగోలుకు చెందిన కిరణ్‌కు డబ్బు కట్టడంతో సమస్య మొదలైనట్లు తెలుస్తోంది. తన తండ్రి రామిరెడ్డిని ఉద్దేశించి సూసైడ్ నోట్ రాశారు. ఆ వివరాలిలా.. 'ఉద్యోగం కోసం మీ దగ్గర డబ్బులు తీసుకుని నా స్నేహితుడు అయిన కిరణ్‌ను నమ్మి డబ్బు కట్టా. నా పూచీ మీద మరో ఇద్దరు స్నేహితులం కలిపి రూ.10.33 లక్షలు ఇచ్చాం. తర్వాత తెలిసింది అది ఫ్రాడ్ కంపెనీ అని. కిరణ్‌ని చాలాసార్లు డబ్బు అడిగా.. ఇస్తా ఇస్తా అని చెబుతూనే ఉన్నాడు. ఇంతలో నా తరఫున డబ్బు కట్టిన ఓ స్నేహితుడు ఆత్మహత్యకు యత్నించాడు. నా వల్ల నువ్వు వారి వద్ద మాట పడాల్సి వచ్చింది. నన్ను క్షమించండి. కిరణ్‌కు ఎన్నిసార్లు ఫోను చేసినా సమాధానం లేదు. ఇవాళ, రేపు వస్తుందని అంటున్నాడు. ఈ ఒత్తిడి తట్టుకోలేక చనిపోతున్నా' అంటూ నోట్‌లో రాశారు. కిరణ్ అందుబాటులో లేకుండా పోవడం.. మిగతా మిత్రులు డబ్బు కోసం ఒత్తిడి తేవడంతో ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది. మంగళవారం రాత్రి తమ ఇంటి మిద్దెపైనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు బుధవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో పైకి వెళ్లి చూసి విగతజీవిగా ఉన్న బిడ్డను చూసి కన్నీరుమున్నీరయ్యారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ మారుతి పరిశీలించారు. సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకుని.. గ్రామంలో విచారించారు. తండ్రి రామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వినాశకరమైన విద్యుత్ సంస్కరణలు ఆపాలి



ప్రజాభిప్రాయసేకరణలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్) జనవరి 31 : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వినాశకరమైన విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తూ ప్రజలపై అధిక భారం మోపుతోందని, వీటిని వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా నాయకుడు కందారపు మురళి డిమాండ్ చేశారు. మూడు రోజులుగా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చేపట్టిన విద్యుత్ వినియోగదారుల బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ మూడోరోజు బుధవారం తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించారు. హాజరైన మురళి మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరానికి డిస్కంలు రూ.1,387కోట్లు ఆదాయ లోటును చూపాయన్నారు. ఆ లోటును ఎలా భర్తీ చేస్తారో చెప్పకుండా దొడ్డిదారిన వినియోగదారులపై భారం మోపేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని నియంత్రణ మండలి అనుమతించకూడదని కోరారు. గతంలోనూ ఇలా ఆర్థిక లోటు పూడ్చేందుకు ప్రజలపై భారం వేశారని గుర్తు చేశారు. నాలుగున్నరేళ్లలో జగన్ ప్రభుత్వం పలుమార్లు విద్యుత్ చార్జీలు పెంచిందన్నారు. డిస్కంలకు ఇవ్వాల్సిన రూ.25వేల కోట్లను బకాయి పెట్టడం వల్ల అధిక వడ్డీకి రుణాలు తీసుకుని సంక్షోభంలో కూరుకుపోయాయని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రభుత్వ ఖజానా నుంచి వేలకోట్ల రూపాయలు అదానీ గ్రూప్, షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ సహా ఇతర ప్రైవేటు కంపెనీలకు కట్టపెట్టేందుకు రంగం సిద్ధమైందని, దీన్ని రెగ్యులేటరీ కమిషన్ అడ్డుకోవాలని కోరారు. వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చట్టరీత్యా నేరమన్నారు. 2004 నుంచి 2019 వరకు వినియోగదారులు వాడిన విద్యుత్‌కు సుమారు రూ.56,735కోట్లు ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజల నుంచి వసూలు చేయడం ఏమిటని మండిపడ్డారు. అలాగే ప్రతినెలా ఫిక్స్‌డ్, కస్టమర్ చార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు చార్జీలు, ఇందనపు చార్జీలు, అడిషనల్ లోడ్ చార్జీల రూపంలో భారం వేయడాన్ని కమిషన్ అనుమతించకూడదన్నారు. గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ సంస్థలోని అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ (టెక్నికల్) శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, అమరరాజా సంస్థ నుంచి డీజీఎం కేకుమారస్వామి ఆన్‌లైన్‌లో హాజరై మాట్లాడుతూ సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న కేప్టివ్ ప్లాంట్ ద్వారా విద్యుత్ సరఫరా, వినియోగం తదితర అంశాలలో సాంకేతికపరంగా చార్జీలు నిర్ణయించే ఒప్పందాలను కమిషన్ మరోసారి పరిశీలించాలని కోరారు.

దేవదొడ్డిలో స్థలవివాదంపై ఉద్రిక్తత

టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం



బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌వద్ద గుమికూడిన జనం

బైరెడ్డిపల్లె, జనవరి 31 : మండలంలోని దేవదొడ్డి గ్రామంలో ఓ స్థలానికి సంబంధించి కొంతకాలంగా టీడీపీ నాయకుడు అమీర్‌కు, వైసీపీ నాయకుల మధ్య వివాదం జరుగుతోంది. బుధవారం సంబంధిత స్థలంలో వైసీపీ వారు కట్టడం పనులు చేపడుతున్నారని, నిలుపుదల చేసి తనకు న్యాయం చేయాలని టీడీపీ నాయకుడు అమీర్ దేవదొడ్డి వద్ద ఆందోళనకు పూనుకోవడంతో పోలీసులు వచ్చి దీన్ని అడ్డుకున్నారు. ఆ స్థలం తమకే చెందుతుందని ఇరువర్గాల వారు పోలీసుల ఎదుట వాదోపవాదాలకు దిగారు. ఆ సమయంలో కొందరు వైసీపీ శ్రేణులు పోలీసులపై దురుసుగా ప్రవర్తించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కాగా టీడీపీ నాయకుడు అమీర్‌ను పోలీసులు పోలీసుస్టేషన్‌కు తరలించడంతో పలువురు టీడీపీ శ్రేణులు, దేవదొడ్డి గ్రామస్తులు బైరెడ్డిపల్లె పోలీసుస్టేషన్ వద్దకు చేరుకున్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి పోలీసులతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బడి ఈడు పిల్లలను బడిలోనే ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సింధు

పుంగనూరు రూరల్, జనవరి31: బడిఈడు పిల్లలను పాఠశాలల్లో ఉండేలా పిల్లల తల్లిదండ్రులు, అధికారులు కృషి చేయాలని న్యాయమూర్తి సింధు కోరారు. బుధవారం స్థానిక దోభీకాలనీలోని మున్సిపల్ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు బాలల హక్కులు, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల హక్కులను కాలరాస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి అవకాశం ఉందన్నారు. పిల్లలను చదువుకోవడానికి పంపకుండా పనులకు పంపినా, పనిలో పెట్టుకున్నా వారిపై చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఏఎస్ఐ గౌరీశంకర్, హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షికారి కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న న్యాయవాది సయ్యద్ మొహిద్దీన్

పలమనేరు, జనవరి31 :పలమనేరు మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, పలమనేరు సీనియర్ సివిల్‌జడ్జి పగడాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో షికారికాలనీలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. స్ట్రీట్ చిల్డ్రన్ డే సందర్భంగా నిర్వహించిన ఈ సదస్సులో న్యాయవాదులు సయ్యద్ మొహిద్దీన్, అరీఫుల్లాఖాన్ మాట్లాడుతూ బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా బడికి పంపాలన్నారు. పిల్లలచేత పనులు చేయించినా, పనులకు పంపినా, పనిలో పెట్టుకొన్నా నేరస్థులే అవుతారని వివరించారు. చిన్నవయస్సులోనే వారిని చక్కగా చదివించాలే తప్ప ఎటువంటి పనులకు పంపరాదని సూచించారు. ఈ సదస్సులో పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బలిజల అభివృద్ధి



మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్

శాంతిపురం, జనవరి 31 : టీడీపీ హయాంలోనే బలిజ కులస్తులు అభివృద్ధి చెందారని మండల టీడీపీ మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ మణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో టీడీపీ బలిజ కుల సంఘ నేతలు సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బలిజ కులస్తులకు చంద్రబాబు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, సబ్సిడీ రుణాలు ఇచ్చి వారిని ఆర్థికంగా అభివృద్ధి పరిచారన్నారు. రాజకీయంగా అనేక పదవులు కట్టబెట్టారన్నారు. బలిజలకు చంద్రబాబు ఇచ్చిన పథకాలను వైసీపీ నీరుగార్చిందన్నారు. బలిజ కులస్తులందరూ ఏకతాటిపై నిలబడి టీడీపీని బలపరచాలన్నారు. అలాగే మండలాల వారీగా బలిజ కుల సంఘం కమిటీలను ఎన్నుకోవాలని తీర్మానించారు. బలిజ సంఘం నేతలు గోపినాథ్, మురళి, లోకేష్, సత్యేంద్ర శేఖర్, వెంకటరమణబాబు, మంజునాథ్, శివ, నాని, జయరాజ్, కుమార్, నాగభూషణం, ఉమాపతి, మురుగేష్, సురేష్, శేఖర్, విజయకుమార్, రవి, బాలు, రమేష్, బాబు, సుగున్నమ్మ, అనుసూయ, రూప, సరిత, వేదవతి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సీతారామ్

పుంగనూరు రూరల్, జనవరి31: ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తహసీల్దార్ సీతారామ్ పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీ పరిధిలో శ్మశానాలకు స్థలాను కేటాయించామన్నారు. ఎస్సీ, ఎస్టీకాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ఇటుకనెల్లూరులో అంబేద్కర్ కమ్యూనిటీ భవనం ప్రారంభించినట్లు తెలిపారు. సమావేశంలో ముడా ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మున్సిపల్ మేనేజర్ రసూల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి పుంగనూరులో చల్లాబాబు పర్యటన



చల్లాబాబును కలిసిన పుంగనూరు నాయకులు

రొంపిచెర్ల, జనవరి 31: ఈనెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు పుంగనూరు పట్టణంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పుంగనూరు టీడీపీ నాయకులు బుధవారం రొంపిచెర్లలోని చల్లాబాబును స్వగృహం వద్ద కలిశారు. ఆయనకు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు శివప్పనాయుడు, మురళి, అమరనాథ్, రామకృష్ణ, చరణ్, ముల్లంగి వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ జట్టుకు వి.కోట విద్యార్థుల ఎంపిక



వి.కోట, జనవరి 31: ఇటీవల తిరుపతిలో జరిగిన జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో వి.కోట చైతన్య చిల్డ్రన్స్ అకాడమీకి చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబకనబరచి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటరమణారెడ్డి, పీఈటి శంకర్ తెలిపారు. ఫిబ్రవరి 3,4 తేదీల్లో విశాఖపట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు జ్యోతిష్, సందీప్, బ్యూలాతురు, నయిమాలు జిల్లా జట్టుకు ప్రాతినిత్యం వహించనున్నారన్నారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

మృతుల కుటుంబాలకు టీడీపీ ఆర్థిక సాయం

రామకుప్పం, జనవరి 31: రామకుప్పం మండలం ననియాలతాండ, రామాపురంతాండా, పేరూరు గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు చిన్నతాయమ్మ, రెడ్డినాయక్, చిన్నలు మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, ఎసీంటసల్లె జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, బీసీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మనోహర్, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, బీసీసెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటరమణలు పార్టీ నేతలతో కలిసి మృతుల మృతదేహాలను సందర్శించి, నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబసభ్యులకు వారు పార్టీ తరపున రూ.10వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

దుర్గసముద్రం వార్డు సభ్యుడు రాజీనామా

చౌడేపల్లె, జనవరి31: చౌడేపల్లె మండలం దుర్గసముద్రం పంచాయతీ 7 వార్డు సభ్యుడు ప్రభాకర్ రెడ్డి బుధవారం తన సభ్యత్వానికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఎంపీడీవో సుధాకర్‌కు సమర్పించారు. వ్యక్తిగత కారణాలతో తాను రాజనామా చేసినట్లు ఎంపీడీవోకు వివరించారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

మాజీ మంత్రి అమరనాథరెడ్డి



బయప్పగారిపల్లిలో అమరనాథరెడ్డికి ఆహ్వానం పలుకుతున్న యువకులు

పలమనేరు, జనవరి31 : నాలుగున్నర ఏళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, దీన్ని మళ్లీ సరైన దారిలో తీసుకు రావాలంటే అనుభవజ్ఞులైన చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని, ఇందుకోసం యువకులు బాధ్యత తీసుకోవాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పలమనేరు మండలం బయప్పగారిపల్లి పంచాయితీ ఊసరపెంట, కాలువపల్లి, మండిపేట, కోటూరు, చెత్తపెంట గ్రామాల్లో అమరనాథరెడ్డి ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, చేసిన పంటలకు రైతులకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయారని, విద్యుత్ ఛార్జీలు గత నాలుగున్నర ఏళ్లలో 9 సార్లు పెంచారని, డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. బయప్పగారిపల్లి పంచాయితీలో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సీసీరోడ్లు, మురుగునీటి కాలువలు నిర్మించామని, అప్పుడు వేసిన ఎల్ఈడీ లైట్లు లేకుంటే నేడు గ్రామాల్లో చీకటి వుండేదన్నారు. పంచాయితీలను నిర్వీర్యం చేసిందని, చవరకు చెత్తపై కూడా పన్నులు వేసే చెత్తప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లువేసి మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఈసందర్భంగా టీడీపీ ముద్రించిన మ్యానిఫెస్టోను ప్రజలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజరెడ్డి, నాయకులు జగదీష్‌నాయుడు, రామ్మూర్తినాయుడు, చిన్నబ్బ, గణేష్, బాలాజినాయుడు, మూర్తినాయుడు, దాముునాయుడు, గోపాల్ నాయుడు, జగన్నాథం, వెంకటమునిరెడ్డి, రజనీకాంత్, హరి, గిరి, వాసు, గుణ, మాజీ ఎంపీపీ గీత, నాయకురాళ్లు శివకుమారి, జనసేన నాయకులు దిలీప్, నాగరాజు, శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక



పలమనేరు, జనవరి31 : పలమనేరు మండలం మండిపేట గ్రామానికి చెందిన సంతోష్‌నాయుడు, కొల్లాబాబునాయుడు, ప్రకాష్, హరిజనవాడకు చెందిన గుణశేఖర్, అన్బు, మహేష్, శివలింగం, మణి, పాండు, రాజీవ్‌గాంధీ, విజయ్, జయప్రకాష్, మది, చక్రవర్తి, చిదంబరంతోపాటు వారి అనుచరులు టీడీపీలో చేరారు. బుధవారం మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమంలో వచ్చిన సందర్భంగా ఆయన సమక్షంలో టీడీపీలో చేరగా వారికి అమరనాథరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

మైనారిటీలకు జగన్ ధోకా

కుప్పం నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా

కుప్పం, జనవరి 31: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మైనారిటీ వర్గాలకు ధోకా చేశారని తెలుగుదేశం పార్టీ కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అధ్యక్షతన మైనారిటీల సమావేశం జరిగింది. గాజుల ఖాదర్ బాషాతోపాటు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకీర్, సీనియర్ నాయకులు అన్సర్‌ల ఆధ్వర్యంలో మైనారిటీ ప్రచార కమిటీని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు మైనారిటీలకు 50 శాతం సబ్సిడీతో రూ.2 లక్షల మేర రుణాలను అందించారని గుర్తు చేశారు. అలాగే రాష్ట్ర నూర్ బాషా పెడరేషన్ కొత్తగా స్థాపించి రూ.50 కోట్లు గ్రాంట్‌ను విడుదల చేశారని చెప్పారు. పేద ముస్లింలలో విద్యా వ్యాప్తికోసం ఉర్దూ, ఇంగ్లీష్ మీడియం గురుకుల పాఠశాలల ఏర్పాటుతోపాటు ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అర్హులైన విద్యార్థులందరికీ అందించిన విషయాన్ని గుర్తు చేశారు. పేద ముస్లిం విద్యార్థుల విదేశీ చదువు కోసం ఒక్కొక్కరికి రూ.10 లక్షల వవంతున ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. ముస్లిం మైనారిటీలకోసం ఇంకా అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని తెలిపారు. కానీ జగన్ ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకోసం ఏమి చేసిందని నిలదీశారు. ఉన్న పథకాలను రద్దు చేసిందని ధ్వజమెత్తారు. మళ్లీ మంచిరోజులు రావాలంటే బాబు అధికారంలోకి రావాలని, అందుకు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకులు ఇమ్రాన్, ఉమర్, మునాఫ్, ఇస్మాయిల్, సజ్జు, జావేద్, సలీం, మహబూబ్ బాషా, ఫైరోజ్, ఇర్ఫాన్, ఖలీల్ పాల్గొన్నారు.



కుప్పం టీడీపీ కార్యాలయంలో ముస్లిం మైనారిటీల సమావేశం

యాక్ట్ 27ను రద్దు చేసే వరకు నిరసనలు



రిలే దీక్షలు చేస్తున్న న్యాయవాదులు

పుంగనూరు రూరల్, జనవరి31: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక చట్టాన్ని రద్దు చేసే వరకు నిరసనలు, ఆందోళనలు తీవ్రంగా ఉంటాయని న్యాయవాదులు హెచ్చరించారు. బుధవారం కోర్టు సమీపంలోని బైపాస్‌రోడ్డుపై రిలే నిరహాదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యాక్ట్ 27ను రద్దు చేయాలని ఆందోళనలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ చట్టం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివుందన్నారు. వ్యవసాయ భూములపై చిన్న చిన్న సమస్యలు వస్తే రైతులు కోర్టును ఆశ్రయించేవారని, ప్రస్తుతం కోర్టుకు వెళ్లకుండా రాజకీయ పార్టీ నాయకులకు అనుకూలంగా మార్చుకోవడానికి ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మల్లికార్జునాయుడు, ఆనంద్‌కుమార్, ఎంవీ. ప్రసాద్, శ్రీకాంత్, కుమార్‌రెడ్డి, కిషోర్‌కుమార్, శివశంకర్‌నాయుడు, వెంకటముని, శరత్‌కుమార్, సురేశ్‌బాబు, గిరధర్, హేమంత్, శ్రీనివాసులు, వెంకటరమణ, వినోద్, కృష్ణారెడ్డి, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికే అధిక ప్రాధాన్యత

పుంగనూరు మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా

పుంగనూరు, జనవరి31: పట్టణాభివృద్ధికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా తెలిపారు. బుధవారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేసి డివైడర్లు, ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేసి పట్టణాన్ని అంలకారప్రాయంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ అమ్ము మాట్లాడుతూ అంజెండా అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ పూలత్యాగరాజు మాట్లాడుతూ పట్టణంలో విద్యుత్‌లైట్లు రాత్రి, పగలు వెలుగుతున్నాయని మున్సిపల్ అధికారులు పర్యవేక్షించి సకాలంలో లైట్లు ఉదయాన్నే ఆఫ్ చేయాలని కోరారు. కౌన్సిలర్ అర్షద్‌అలీ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు చేస్తున్న సమయంలో మురుగునీరు రోడ్లపైకి రావడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మురుగునీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా

రామ భక్తులకు సన్మానం



బైరెడ్డిపల్లె, జనవరి 31 : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఇటీవల మండలంలో అయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీచేసి స్వామిసేవలో పాల్గొన్న శ్రీరామభక్తమండలి సభ్యులను బుధవారం విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు హరిబాబు ఘనంగా సన్మానించారు. ఇదే స్ఫూర్తితో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ ప్రతినిధులు సిద్దయ్య, భాస్కర్‌రావు, హరినాథ్, ఎల్లారెడ్డి, ధనంజయరెడ్డి, చిరంజీవి, సాయి, యశోదర, మణి తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

చౌడేపల్లె, జనవరి31: గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పు పెట్టడంతో దగ్ధమైన ఘటన చౌడేపల్లె మండలంలో బుధవారం రాత్రి జరిగింది. బాధితుల కథనం మేరకు .. పరికిదోన పంచాయతీ దిగువమల్లెలవారిపల్లెకు చెందిన బడుగు శ్రీరాములుకు గ్రామ సమీపంలోని బోడిగుట్ట సమీపంలో కొంత పొలం ఉంది. పొలం వద్ద తన పాడి ఆవుల మేత కోసం రూ.15వేలు విలువ చేసే వరిగడ్డిని నిల్వ ఉంచారు. ఈక్రమంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయింది.

ఉద్యోగ విరమణ పొందిన హెచ్ఎంకు సన్మానం



బైరెడ్డిపల్లె, జనవరి 31 : స్థానిక ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం పనిచేస్తూ ఉద్యోగవిరమణ పొందిన శివయ్యను బుధవారం ఎంఈవోలు సాయిలీల, సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే స్థానిక జడ్పీఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగవిరమణ చేసిన ప్రభాకర్‌ను కూడా ఎంఈవోలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

గ్రంథాలయాధికారి సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న విశాంత్ర బీసీ వెల్ఫేర్ అధికారి

సోమల, జనవరి 31: సోమల శాఖా గ్రంథాలయం ఇన్‌చార్జి రామకృష్ణ సేవలు అభినందనీయం మని విశాంత్ర బీసీ సంక్షేమ అధికారి ఎన్. మునివెంకటప్ప అన్నారు. బుధవారం రామకృష్ణ పదవీ విరమణ సందర్భంగా పలువురు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో విశాంత్ర హెచ్ఎం కోటీశ్వరయ్య, చౌడేపల్లె, కలికిరి గ్రంథాలయ అధికారులు సోమశేఖర్, విజయకుమార్, అరుణశ్రీ, గ్రంథాలయ కమిటీ సభ్యులు రాణి, అభి, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

కరపత్రాల అవిష్కరణ



రొంపిచెర్ల, జనవరి 31: బీసీల రాజాధికారం కోసం గత డిసెంబరు నెలలో ప్రారంభమైన మరో స్వాతంత్ర రథయాత్ర ముగింపు సభ(తిరుపతి ఇందిరా మైదానం)కు సంబంధించిన కరపత్రాలను రొంపిచెర్లలో బీసీ నాయ కులు బుధవారం ఆవిష్కరించారు. పాలేకరి రాష్ట్ర కన్వీనర్ శివప్రసాద్‌నాయుడు, రాష్ట్ర వడ్డెర సంఘం నాయకుడు వెంకటేష్, రాయసీమ జిల్లాల అధికార ప్రతినిధి బంగారు నారాయణస్వామి కరపత్రాలు ఆవిష్కరించారు.

నిరంతరంగా ఓటరు నమోదు ప్రక్రియ : డీఆర్వో

చిత్తూరు (సెంట్రల్), జనవరి 31: ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని డీఆర్వో రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఫారం 6,7,8 ఫారంలకు సంబంధించి సకాలంలో పరిశీలించి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరేట్, ఆర్‌డీవో కార్యాలయాలు, పోలింగ్ స్టేషన్ల వద్ద మొబైల్ వాహనాల ద్వారా ఈవీఎం, వీవీ ప్యాట్‌పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. పోలింగ్‌కేంద్రాల వద్ద మౌళిక సదుపాయాలను పీఆర్ మున్సిపల్ శాఖలు చూసుకోవాలని సూచించారు.

తోపుడు బండ్ల వితరణ



కుప్పం, జనవరి 31: కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో బుధవారం బీసీఎన్ చారిటబుల్ ట్రస్ట్, లయన్స్ క్లబ్, లియో లయన్స్ క్లబ్ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో పేదవారికి తోపుడు బండ్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా కేఈసీ వైస్ ఛైర్మన్, లియో లయన్స్ క్లబ్ సభ్యుడు డాక్టర్ సునీల్‌రాజ్ మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థుల్లో సేవా దృక్పథం పెంచడానికి ఈ కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేఈసీ ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ ఎ.మహేశ్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మాధవన్, శరవణ, గంగాధర్, పీఆర్వో ప్రవీణ్, కలీం, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ

కుప్పం, జనవరి 31: కుప్పం సమీపంలోని పరమసముద్రంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు కళ్యాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష సామగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మల్లీశ్వరి, ఫౌండేషన్ నాయకుడు సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదవీ విరమణ కండక్టర్‌కు సన్మానం



కుప్పం, జనవరి 31: కుప్పం డిపోలో 20 ఏళ్లగా కండక్టర్‌గా పనిచేసిన కె.నారాయణరెడ్డి బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు డిపో ఆవరణలో బుధవారం ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. శాలువా కప్పి, పూలమాల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీకి నారాయణరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు ఎస్.మునస్వామి, ఛైర్మన్ బొట్టు మణి, నాయకులు కె.శ్రీనివాసులు, ఇ.జయపాల్, ఎ.వెంకటేష్, దిలీప్ కుమార్, ఎస్ ఆర్.రాజా, ఎల్లుస్వామి, మణ్యం, జేఎస్.నారాయణ, జేవీ రమణ, బీఈ.ప్రసాద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మిశి ఐటీఐ ఉద్యోగికి సన్మానం



శాంతిపురం, జనవరి 31 : మండల పరిధిలోని తుమ్మిశి ఐటీఐ కళాశాలలో ట్రైనింగ్ ఆఫీసర్‌గా ఉన్న ఇజ్రాయిల్ జాకబ్ బుధవారం పదవీ విరమణ చేశారు. వారి దంపతులకు కళాశాల సిబ్బంది సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇజ్రాయిల్ జాకబ్ ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. అనంతరం జాకబ్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపల్ నగేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల తాళాల అందజేత

పుంగనూరు, జనవరి31: టిడ్కో ఇళ్లకు సంబంధించిన తాళాలను 1536మంది లబ్ధిదారులకు బుధవారం అందజేసినట్లు మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులు వెంటనే ఇళ్లలోకి చేరుకోవాలని కోరారు. కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



పుంగనూరు రూరల్, జనవరి31: ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం అర్థరాత్రి బాలాజీ కాలనీ సమీపంలో జరిగింది. మండలంలోని రాగానిపల్లెపంచాయతీ లక్కుంటకు చెందిన నరసింహులు కుమారుడు అనిల్‌కుమార్(24) మదనపల్లెలో ఓ ప్రైవేటు కంపెనీలో వస్తువుల డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథంలో పనులు ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా బాలాజీ కాలనీ సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్ కళ్లకు పడడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో అనిల్‌కుమార్ తలకు బలమైన గాయాలు తగిలాయి. స్థానికులు గుర్తించి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు తిరుపతికి తరలించారు. :

పౌరహక్కుల దినోత్సవం

వి.కోట, జనవరి 31: మండలపరిధిలోని పాముగానిపల్లె పంచాయతీ యర్నపల్లెలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం అమలు చేస్తున్న పథకాలను తహసీల్దార్ చిట్టిబాబు వివరించారు. అలాగే చట్టాలపై సైతం అవగాహన కల్గిఉండాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కున్న వారందరూ కచ్చితంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ లింగప్ప, ఎంపీడీవో మహ్మద్‌రఫి, సర్పంచ్ సుబ్బారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

పలమనేరు వైసీపీ యూత్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి



వి.కోట, జనవరి31: పలమనేరు నియోజకవర్గ వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా వి.కోట మండలం పడిగలకుప్పానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డిని ఎంపిక చేస్తూ జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ భరత్, జిల్లా యూత్ అధ్యక్షుడు హేమనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలోను చంద్రశేఖర్‌రెడ్డి ఇదే పదవిలో కొనసాగగా, తిరిగి అతడిని ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

వైసీపీ ప్రభుత్వంపై జనాగ్రహం: దొరబాబు



24వ డివిజన్‌లో టీడీపీ నేతలకు ఘనస్వాగతం పలుకుతున్న స్థానికులు

చిత్తూరు సిటీ, జనవరి 31: వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. బుధవారం నగరంలోని 24వ డివిజన్ న్యూట్రిన్ ఫ్యాక్టరీ సమీపంలో, టీవీ రెడ్డి పెట్రోల్ బంక్ వద్ద, 25వ డివిజన్ గిరింపేట తదితర ప్రాంతాల్లో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. దొరబాబు మాట్లాడుతూ టీడీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు ప్రశాంతంగా జీవించారని, వైసీపీ పాలనలో భయం గుప్పిట్లో బతుకుతున్నారని చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం స్థానికులకు టీడీపీ మినీ మ్యానిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో నేతలు సురేంద్రకుమార్, చంద్రప్రకాష్, కటారి హేమలత, గురజాల జగన్మోహన్, సీఆర్ రాజన్, కాజూరు బాలాజి, అశోక్, శంకర్, సుబ్రమణ్యం, కంద, రాజశేఖర్, జాఫర్, కోడిబాబు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే విడుదల చేయాలి

● కలెక్టరేట్ వద్ద దీక్షను ప్రారంభించిన యూటీఎఫ్ నేతలు



ధర్నాలో పాల్గొన్న యూటీఎఫ్ నేతలు

చిత్తూరు, జనవరి 31: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి ఉద్యోగం చేసి జీతంలో నుంచి కోత విధించుకుని దాచుకున్న డబ్బులను ప్రభుత్వం దుర్మార్గంగా వేరే పథకాలకు మళ్లించడం దారుణమన్నారు. ఇప్పటి వరకు రూ.18 వేల కోట్లు పెండింగ్ బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘ నేతలు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుంటే నిర్బంధాలు చేసి, అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

అన్నా క్యాంటీన్‌లో అన్నదానం

తవణంపల్లె, జనవరి 31: తవణంపల్లెలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్‌లో బుధవారం మండలంలోని కొండ్రాజుకాల్వకు చెందిన మురళీ నాయుడు సహకారంతో అన్నదానం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు దిలీప్‌కుమార్, నాయకులు వెంకటేష్ చౌదరి, శరవణ, సుభాష్ నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా కలశస్థాపన



ప్రత్యేకాలంకరణలో సుబ్రమణ్యం స్వామి

కార్వేటినగరం, జనవరి 31: కార్వేటినగరం కొమరగిరిపై కంచి కామకోటి పీఠాధిపతులు చంద్రశేఖర్ సరస్వతి, జయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ రాజగోపురంపై కలశ స్థాపన కార్యక్రమం బుధవారం వందలాది మంది భక్తుల సమక్షంలో కన్నులపండువగా సాగింది. కలశ స్థాపన కార్యక్రమానికి భక్తులు కర్పూర హారతి నీరాజనాలు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కృష్ణ నాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత



అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చూపుతున్న చిత్తూరు రైల్వే పోలీసులు

చిత్తూరు రూరల్, జనవరి 31: బెంగళూరు నుంచి కాకినాడకు వెళ్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని చిత్తూరు రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... బుధవారం శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో బెంగళూరు నుంచి బాపట్ల వెళ్తున్న సుజిత్ (30) అనే వ్యక్తి వద్ద 16 మద్యం బాటిళ్లు ఉన్నాయని చిత్తూరు రైల్వే పోలీసులకు ఉన్నతాధికారులు సమాచారం అందించారు. అతడిని చిత్తూరు రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకొని 16 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ఓటరు జాబితాపై సమావేశం

పూతలపట్టు, జనవరి 31: ఓటరు జాబితాలో తప్పొప్పులుంటే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ విజయ భాస్కర్ కోరారు. బుధవారం ఆయన పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీటీలు మహేశ్వరి, హేమగిరితో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విజయానందరెడ్డికి సమస్యల వెల్లువ

గుడిపాల, జనవరి 31: మండలంలోని పానాటూరు, గుడిపాల పంచాయతీల్లో వైసీపీ సమన్వయకర్త విజయానంద రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వీలైనంత త్వరలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ రమ్య, నాయకులు మధుసూదన్‌రెడ్డి, కార్మేఘన్, రజనీకాంత్, మొగిలి రెడ్డి, మధుసూదన్ రాయల్, గోళ్ల హరిప్రసాద్ చౌదరి, చిట్టిబాబు, గోపినాథ్, బాబుతదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

చిత్తూరు, జనవరి 31: చిత్తూరు నగరంలోని ఇరువారం వద్ద ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. దళిత సంఘాల నేతలు డేవిడ్, మనోహర్, మునస్వామి, దాము, మణి, దాస్, థామస్, జయకుమార్, హరి, పార్థసారథి పాల్గొన్నారు.

ఆకతాయిల నుంచి రక్షణ కల్పించాలి

గుడిపాల, జనవరి 31: మండలంలోని బొమ్మసముద్రం కళాశాల వద్ద ఆకతాయిల నుంచి విద్యార్థినులకు రక్షణ కల్పించాలని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బొమ్మసముద్రం క్రాస్‌లో ఉన్న కళాశాల వదిలిన వెంటనే ఆకతాయి యువకులు, మందుబాబులు విద్యార్థినులను వేధిస్తున్నారని, వారిపై చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు. కళాశాల నుంచి తమ గ్రామాలకు వెళ్ళేటప్పుడు బైకులపై వచ్చి విద్యార్థినులను బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. వీరిపై తగినచర్యలు తీసుకోవాలని కోరారు.

జగన్‌ను కలసిన వైసీపీ నేత రాజేశ్



వెదురుకుప్పం, జనవరి 31: తాడేపల్లిలో సీఎం జగన్‌ను వైసీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ నేత, ఎమ్మెల్యే టికెట్ ఆశావహులు నూకతోటి రాజేశ్ మంగళవారం రాత్రి కలిశారు. సీఎం జగన్‌కి పుష్పగుచ్ఛమిచ్చి, శాలువ కప్పి సంభాషించారు. కాగా బుధవారం రాత్రి వైసీపీ అధిష్ఠానం 5వ విడత జాబితాను విడుదల చేసింది. ఈ క్రమంలో మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ అక్క కుమారుడు నూకతోటి రాజేశ్‌ను సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది.

గ్రామాభివృద్ధి పట్ల నాయకులకు నిర్లక్ష్యం: జనసేన



జనసేన కరపత్రాలను అందిస్తున్న జనసేన యుగంధర్

వెదురుకుప్పం, జనవరి 31: గ్రామాభివృద్ధి పట్ల నాయకులకు శ్రద్ధ లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జనసేన పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న విమర్శించారు. బుధవారం వెదురుకుప్పం మండలం అడపాలబైలు గ్రామంలో 'జనం కోసం జనసేన' కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అడపాలబైలులో తాగునీటి కోసం పదేళ్ల క్రితం వాటర్ ట్యాంకు నిర్మాణం పనులు చేపట్టినా ఇప్పటికీ నిర్మాణ దశలోనే ఉండటం బాధాకరమన్నారు. అధికారులకు, నాయకులకు ప్రజల పట్ల ఉన్న శ్రద్ధ దీన్ని బట్టే తెలుస్తోందన్నారు. సరి కొత్త ప్రజా ప్రభుత్వంలో ఆ వాటర్ ట్యాంకు నిర్మాణం పూర్తి చేయించి ప్రజలకు అంకితం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ వెదురుకుప్పం మండల ఉపాధ్యక్షుడు మునిరత్నంశెట్టి, నాయకులు యతీశ్వర్‌రెడ్డి, కావలి సతీశ్, రాఘవ, జెనర్థీ, అన్నామలై పాల్గొన్నారు.


వైసీపీకి ఓటమి తప్పదు

కార్వేటినగరం, జనవరి 31: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిగా ఎవరు పోటీ చేసినా ఓటమి తప్పదని జనసేన పార్టీ ఇన్‌చార్జి పొన్నా యుగంధర్ స్పష్టం చేశారు. కార్వేటినగరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి రాష్ట్రంలో అధికారం చేపడుతుందని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సంయుక్తంగా జీడీ నెల్లూరులో ఏ అభ్యర్థిని నిలబెట్టినా గెలిపించుకుంటామని ఆయన చెప్పారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించండి

చిత్తూరు, జనవరి 31: నగరపాలక పరిధిలో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ అరుణ నగరపాలక అధికారులు, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో పన్నుల వసూళ్లపై ఇంజనీరింగ్, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగం, అకౌంట్స్ సెక్షన్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి వార్డులో క్లస్టర్ స్థాయిలో పన్నుల జాబితాను, దీర్ఘకాలిక బకాయిల జాబితాను తయారు చేసి డోర్ టు డోర్ వెళ్లాలన్నారు. పన్నుల వసూళ్లపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఎంహెచ్‌వో లోకేష్, సీఎంఎం గోపి, ఆర్వో గోపాలకృష్ణ, వార్డు కార్యదర్శులు, సీవోలు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు సన్మానం



కార్వేటినగరం, జనవరి 31: కార్వేటినగరం మండల డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తున్న లక్ష్మీపతి బుధవారం పదవీ విరమణ చేశారు. ఈసందర్భంగా పుత్తూరులో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో కార్వేటినగరం తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో లక్ష్మీపతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం దొంగల్ని ప్రోత్సహించిన నారాయణస్వామీ దొంగే

- జయహో బీసీ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి థామస్



సమావేశంలో మాట్లాడుతున్న థామస్

పెనుమూరు, జనవరి 31: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఎర్రచందనం, ఇసుక దొంగల్ని పెంచి పోషించిన డిప్యూటీ సీఎం నారాయణస్వామీ కూడా పెద్ద దొంగేనని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి థామస్ అన్నారు. బుధవారం ఆయన పెనుమూరులో మండల బీసీ అధ్యక్షుడు అశోక్, మండల టీడీపీ అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు, ప్రధానకార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమానికిహాజరయ్యారు. ముందుగా తహసీల్దారు కార్యాలయంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి, పక్కనే ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి బస్టాండు మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో నియోజకవర్గం నుంచి బీసీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు ప్రాధాన్యం కల్పించింది టీడీపీయేనని తెలిపారు. ప్రజలు టీడీపీకి ఓటేసి తనను గెలిపిస్తే నియోజకవర్గానికి కంపెనీలు తీసుకువచ్చి, పిల్లలకు మంచి భవిష్యత్తు కల్పిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సీఆర్.రాజన్ మాట్లాడుతూ రాష్ట్రం బాగుపడాలన్నా, బీసీలకు న్యాయం జరగాలన్నా, మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. అనంతరం శాతంబాకం మాజీ సర్పంచ్ శ్రీరాములుకు థామస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యనిర్వాహక కార్యదర్శి లోకనాథ నాయుడు, జిల్లా టీడీపీ ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, జిల్లా యాదవ సాధికారసమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ, నాయకులు రవిప్రకాష్ నాయుడు, మునిరాజు, వెంకటేశ్ యాదవ్, నాగేశ్వరనాజు, తలారి రెడ్డెప్ప, ఈశ్వర్‌ప్రసాద్, పసుపులేటి రమేష్, మనోహర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, కృష్ణమూర్తి నాయుడు, పరమేశ్వర్‌రెడ్డి, గంధమనేని జయశంకర్ నాయుడు, స్వామిదాస్, లోకనాధరెడ్డి, చెంగళరాయ యాదవ్, యువరాజులు నాయుడు, భాస్కర్ నాయుడు, కిషోర్ నాయుడు, వేణు నాయుడు, దుర్గాప్రసాద్, సురేష్ నాయుడు, జనసేన మండల అధ్యక్షులు శ్రీనివాసులు, బీసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జీజేఎం ఆధ్వర్యంలో తోపుడు బండ్లు పంపిణీ



తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న జగన్మోహన్, దొరబాబు

చిత్తూరు సిటీ, జనవరి 31: జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తోపుడు బండ్లు పంపిణీ చేశారు. బుధవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని జీజేఎం ఫౌండేషన్ కార్యాలయంలో చైర్మన్ గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు చేతుల మీదుగా సుమారు రూ.9 లక్షల విలువచేసే 40 తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లను పంపిణీ చేశారు. గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు జీజేఎం ఫౌండేషన్ తరఫున అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. మంచి పనులు చేసేవారిని అధికారులు ప్రోత్సహించాలని కోరారు. రాజకీయాలకు, సేవా కార్యక్రమాలకు ముడిపెట్టకూడదని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్, నేతలు కార్జాల అరుణ, అశోక్, త్యాగరాజన్, శశికర్ బాబు, ఆనంద్, యువరాజులు నాయుడు, మదన్, బాబు రెడ్డి, సుధాకర్ నాయుడు, ఈశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల హోర్డింగులను తొలగించండి

● జేసీ శ్రీనివాసులుకు టీడీపీ నేతల వినతి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 31: ఎటువంటి అనుమతులు లేకుండా వైసీపీ నాయకులు విజయానందరెడ్డి పేరిట నగరంలో విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన హోర్డింగులు, ఫ్లెక్సీలను వెంటనే తొలగించేటట్లు మున్సిపల్ యంత్రాంగాన్ని ఆదేశించాలని జిల్లా టీడీపీ నాయకులు డిమాండ్‌చేశారు. బుధవారం పలువురు నాయకులు కలెక్టరేట్‌లో జేసీ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన హోర్డింగులు, ఫ్లెక్సీల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా తన వ్యక్తిగత ప్రచారం కోసం విజయానందరెడ్డి ఏర్పాటుచేసిన మినరల్‌వాటర్ ప్లాంట్ పేరిట శాశ్వత కట్టడాలు కట్టి ఇబ్బందులు కల్పిస్తున్నారని, వాటిని వెంటనే తొలగించాలని కోరారు. జేసీని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్సీ టీఎన్ రాజసింహులు, నేతలు కఠారి హేమలత, చంద్రప్రకాష్, గురజాల జగన్మోహన్, సురేంద్రకుమార్, త్యాగరాజన్, రాజశేఖర్, శశికర్ బాబు తదితరులు ఉన్నారు.

మార్చి నెలాఖరుకు లక్ష్యం పూర్తి చేయాలి: జేసీ

చిత్తూరు (సెంట్రల్), జనవరి 31: పాలు పోసే మహిళా పాడి రైతులకు డీఆర్‌డీఏ సమన్వయంతో బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు 2024 మార్చి నాటికి 1883 యూనిట్ల లక్ష్యాన్ని పూర్తి చేయాలని జేసీ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి 14మండలాల ఎంపీడీవోలు, ఏపీఎంలు, మెంటార్స్ రూట్ ఇన్‌చార్జిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మహిళా డెయిరీ సహకార సంఘాల సొసైటీల పేరిట బ్యాంకులలో ఖాతాలు తెరిచే ప్రక్రియను 2024 ఫిబ్రవరి 3వ తేదీ నాటికి పూర్తి చేయాలని, ఈ విషయంలో సహకార శాఖ, డీఆర్‌డీఏ, పశు సంవర్ధక శాఖల సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో శాఖల అధికారులు తులసి, ప్రభాకర్, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరంతరంగా ఓటరు నమోదు ప్రక్రియ: డీఆర్వో

చిత్తూరు (సెంట్రల్), జనవరి 31: ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని డీఆర్వో రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఫారం 6,7,8లకు సంబంధించి సకాలంలో పరిశీలించి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరేట్, ఆర్‌డీవో కార్యాలయాలు, పోలింగ్ స్టేషన్ల వద్ద మొబైల్ వాహనాల ద్వారా ఈవీఎం, వీవీ ప్యాట్‌పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలను పీఆర్ మున్సిపల్ శాఖలు చూసుకోవాలని సూచించారు. సమావేశంలో శ్రీనివాసులు (బీజేపీ), గంగరాజు (సీపీఎం), సురేంద్రకుమార్ (టీడీపీ), ఉదయ్‌కుమార్ (వైసీపీ), భాస్కర్ (బీఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ల జీతాల జాబితా ఇవ్వరా?

- కౌన్సిలర్ బీడీ భాస్కర్




సమావేశంలో ప్రసంగిస్తున్న చైర్మన్ నీలమేఘం

నగరి, జనవరి 31: కౌన్సిలర్ల గౌరవ వేతనాలు చెల్లించారా? లేదా? తెలిపే జాబితా ఇవ్వమని పలుసార్లు అడిగినా ఇవ్వలేదని కౌన్సిలర్ బీడీ భాస్కర్ ప్రశ్నించారు. నగరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం చైర్మన్ నీలమేఘం అధ్యక్షతన జరిగింది. బీడీ భాస్కర్ మాట్లాడుతూ అధికారులేమో గౌరవ వేతనాలు వేసేశామంటున్నారు. మాకు ఎలాంటి మెసేజ్ రావడం లేదని చెప్పారు. స్పందించిన చైర్మన్ నీలమేఘం రెండు, మూడు నెలల జీతాలు మాత్రం పెండింగ్ ఉన్నాయని, తక్షణం జీతాలు చెల్లించిన జాబితాను కౌన్సిలర్లకు పోస్టు ద్వారా అందించాలని సూచించారు. కౌన్సిలర్ మోహన్‌రాజ్ మాట్లాడుతూ తమ వార్డులో గడప గడపకు కార్యక్రమంలో డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోమని మంత్రి రోజా చెప్పినా వదిలేసి మరో పనిని ఎందుకు కేటాయించారని ప్రశ్నించారు. ఇంజనీరింగ్ అధికారి నరేష్ స్పందిస్తూ వంతెన, సిమెంటు రోడ్డుతో పాటు డ్రైనేజీకి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని పలు సమస్యలు పరిష్కరించాలని పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చైర్మన్, కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు వెంకటరత్నం, బాలన్, కౌన్సిలర్ భారతి, కౌన్సిలర్లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన సెర్ప్ ఉద్యోగుల రిలే దీక్ష

చిత్తూరు, జనవరి 31: వైఎస్సార్ క్రాంతి పథంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సెర్ప్ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారంతో మూడో రోజుకు చేరింది. సంఘ జిల్లా కార్యదర్శి మోహన్‌కృష్ణ మాట్లాడుతూ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైఎస్సార్ కాంతిపథంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మినిమం స్కేల్‌ను వర్తింపచేయాలని, హెచ్‌ఆర్‌పీ, ఈపీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు దీక్షను విరమించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నేతలు ప్రభాకర్, రజిని, సుధాకర్, ఉమాపతి, మోహనకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి భానుప్రకాష్ పరామర్శ



నిండ్ర, జనవరి 31: నిండ్ర మండలం కావనూరు సర్పంచ్ మహేష్ తాత ముత్తుకృష్ణయ్య అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్, టీడీపీ నాయకులు ఆయన కర్మక్రియలకు హాజరై మహేష్ కుటుంబానికి సానుభూతి తెలిపారు. ముత్తుకృష్ణయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు.

పేదలకు అన్నదానం

గుడిపాల, జనవరి 31: గుడిపాల అన్నాక్యాంటీన్‌లో బుధవారం మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో 190వ రోజు బెంగళూరుకు చెందిన శివగంగ బిల్డర్స్ యజమాని లంకపల్లి రవినాయుడు భోజనం వితరణ చేశారు.

పూతలపట్టు: అంబేడ్కర్ సర్కిల్‌లోని అన్నాక్యాంటీన్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఊట్ల నాగరాజులు నాయుడు, హేమాద్రి నాయుడు, రమేష్ నాయుడు, ఏకాంబరం, హరి, వీరభద్రయ్య, లోకనాథం నాయుడు, భాస్కర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బలహీనవర్గాల అభ్యున్నతి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మురళీమోహన్

బంగారుపాళ్యం, జనవరి 31: టీడీపీతోనే బలహీనవర్గాల అభ్యున్నతి సాధ్యమౌతుందని పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని సంక్రాంతిపల్లె పంచాయతీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి, కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, మాజీ గీతకార్మిక రాష్ట్ర డైరెక్టర్ మహేంద్ర, హరిబాబు, కమల్‌నాథ రెడ్డి, వంశీ, రాధిక, దేవయాణి, జనార్దన్ గౌడ్, జ్యోతీశ్వరయ్య, సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ కరపత్రాల పంపిణీ

వెదురుకుప్పం, జనవరి 31: వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం, దాసరి కాలనీల్లో బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందించే సంక్షేమ పథకాలను వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటేయ్యాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి బోడిరెడ్డి వెంకటరమణారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కోనేరు చెంగ్రాయరెడ్డి, నాయకులు జయరామరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించండి

పాలసముద్రం, జనవరి 31: రాబోవు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు ఓట్లువేసి గెలిపించాలని పార్టీ చిత్తూరు పార్లమెంటు కార్యదర్శి వాసు నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని బలిజకండ్రిగ, క్రిష్ణజిమ్మాపురం, రాచపాళ్యం గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్ రాజు, నాయకులు జె. విజయ్‌కుమార్, కేశవులు నాయుడు, చిరంజీవి యాదవ్, తంగరాజ్, అరుణ్‌నాదన్, సాంబశివన్, ఏయుమలై, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అండర్-14 ఖోఖో క్రీడలకు టేకుమంద విద్యార్థిని దివ్య ఎంపిక



బంగారుపాళ్యం, జనవరి 31: మండలంలోని టేకుమంద జిల్లాపరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దివ్య జాతీయస్థాయి అండర్-14 ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ సుభాన్ తెలిపారు. 2023 నవంబరు నెలలో బంగారుపాళ్యంలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో దివ్య ప్రతిభ కనబరచి జాతీయస్థాయి బాలికల పోటీలకు ఎంపికైంది. ఈనెల ఒకటో తేది నుంచి జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరుగుతున్న 67వ జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో మన రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. దివ్యను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.


పారిశుధ్య పనులు చేయించండి: టీడీపీ



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

నగరి, జనవరి 31: డెంగ్యూ జ్వరం రాకుండా పారిశుధ్య పనులు చేయించాలని నగరి పట్టణ టీడీపీ నాయకులు బుధవారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరి పట్టణంలోని బస్టాండు తదితర ప్రాంతాల్లో కాలువలు పూర్తిగా మట్టితో పూడిపోయి దుర్గంధం వస్తోందని, తద్వారా రోగాలు వచ్చే ప్రమాదముందని చెప్పారు. శాంతి ఆశ్రమం, మునీశ్వర ఆలయం వద్ద, రామానాయుడుకాలనీ, రాసప్పకాలనీలలో చెత్తకుప్పలు ఎక్కువగా ఉండటంతో పందులు సంచరిస్తున్నాయని తెలిపారు. దీంతో అంటు వ్యాధులు, డెంగ్యూ జ్వరం ప్రబలే ప్రమాదముందని, బ్లీచింగ్ పౌడర్‌వేసి పారిశుధ్యపనులు చేయించాలని కొత్తగా వచ్చిన కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు, టీఎన్‌టీయూసీ జిల్లా అధికారప్రతినిధి జ్యోతి నాయుడు, జిల్లా కార్యదర్శి రుక్కుం బాలాజీ, నాయకులు లోకేంద్రబాబు, కృష్ణారెడ్డి, గుణశేఖర్, నూరుల్లా, కన్నయ్య, ఎన్.సి.శేఖర్, ఆర్ముగం, అశోక్, రమేష్‌రెడ్డి, మన్సూర్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

● కలెక్టరేట్ వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

చిత్తూరు, జనవరి 31: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం బుధవారం కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయ నేతలు, ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి ఆ సంఘ జిల్లా అధ్యక్షులు గోపీనాథ్ మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన పురపాలక, నగరపాలక పాఠశాలల సంఖ్యను పెంచాలని, దానికనుగుణంగా పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. మండలాల్లో సరాసరి పది ఉన్నత పాఠశాలలుంటే మున్సిపాలిటీల్లో కేవలం ఐదు పాఠశాలలు మాత్రమే ఉన్నాయన్నారు. ప్రధాన కార్యదర్శి ముక్తార్ అహ్మద్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్‌ను రూపొందించాలని, వెంటనే బదిలీలు చేపట్టాలని, పీఎఫ్ సౌకర్యం, పీఆర్‌సీ బకాయిలు, మెడికల్ బిల్లులను సత్వరం క్లెయించేయాలన్నారు. ధర్నాలో రాష్ట్ర కౌన్సిలర్ శివశంకర్, జిల్లా నానేతలు వాసు, జగదీశ్, మధు, చందు, ప్రతాప్, హరినాథ్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల ప్రస్తావన ఏది?

చిత్తూరు కల్చరల్, జనవరి 31: రాష్ట్ర వ్యాప్తంగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించకుండా సీఎం అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరగడం శోచనీయమని జిల్లా పెన్షనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్. కేశవులు బుధవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. 12వ పీఆర్‌సీలో పెన్షనర్లకు రావాల్సిన 20శాతం ఇంటీరియం రిలీఫ్‌ను ఇంతవరకు ప్రభుత్వం మంజూరు చేయలేదని, 2018నుంచి రావల్సిన డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన